ప్రజాశక్తి

మంగళవారం 8 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలు పైనే..

- పేరుకే ఉచితం..
- రీచ్‌లు అందుబాటులోకి రానందున బ్లాక్‌లోనే కొనుగోళ్లు
- సామాన్యుడికి ఇప్పటికీ అందుబాటులో రాని పరిస్థితి..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రభుత్వం మారింది. ఇసుక ధర మాత్రం మారలేదు. అదే ధర. ఇంకా చెప్పాలంటే గత ప్రభుత్వంలో కన్నా కొన్ని చోట్ల ఎక్కువగానే ఉందంటున్నారు. పేరుకే ఉచిత ఇసుక. రవాణా ఛార్జీలు, టీఎస్‌టీ, సీనరేజీల రూపంలో బాదుడేబాదుడు అన్నట్లుగానే మారింది. దీంతో ఉచితం అన్నది ప్రచారానికే పరిమితమైంది. ఇసుకపై తర్జనభర్జనలు పడుతున్నారే తప్ప ఆ సమస్యను ఓ కొలిక్కితెచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కారణాలు అనేకం ఉన్నాయి. మంత్రివర్గంలో సుదీర్ఘంగా చర్చించినా ఫలితాలు కనిపించడం లేదు. ఆచరణలో సామాన్యుడికి ఇసుక దొరకడం గగనంగా మారింది. చిన్న ఇల్లు కట్టుకునే పేదవాడి నుంచి భవనాలు కట్టే బిల్డర్లు వరకూ ఇసుకతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్నారు.

గతంలో ఇసుక విధానం తీవ్ర లోప భూయిష్టంగా ఉంది. దాని వల్లే దెబ్బతిన్నామని వైసిపి నేతలు తలలు బాదుకున్నారు. ఎన్నికల్లో దాని ప్రభావం ఏమిటో వాళ్లే చూశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచితం అంటూ ప్రచారం మాత్రం తారాస్థాయిలో చేసుకుంది. ఉన్న కొద్దిపాటి నిల్వలను ఆర్భాటంగా అమ్మకాలు పేరుతో ప్రారంభ కార్యక్రమాలు చేశారు. నాలుగురోజులకు సరిపడా ఇసుకను అందించారు. తర్వాత ఇసుక కోసం నానా పాట్లు తప్పడం లేదు. ఇప్పుడు బహిరంగ మార్కెట్‌లో అంటే బ్లాక్‌లోనే ఇసుక దొరుకుతుంది. ఎక్కడ నుంచి వస్తుందనేదీ అందరికీ తెలిసిందే. ట్రాక్టర్ ట్రక్కు ఇసుక ఇప్పుడు రూ.5 వేల నుంచి డిమాండ్‌ను బట్టి రూ.6 వేలు పలుకుతోంది. జిల్లాలో ఎక్కడైనా ఇదే ధర అమలులో ఉంది. అదే లారీ ఇసుక రూ.16 వేల నుంచి రూ.25 వేల వరకు అమ్ముతున్నారు. ఇలా ఇసుక అందుబాటులో లేకపోగా ధరలు భగ్గుమంటున్నాయి. ఇటీవల ఉచిత ఇసుక పథకం తాలూకు విధి విధానాలు ఖరారు చేశారు. రవాణా ఛార్జీలు నిర్ణయించారు. టన్నుకు ఎంతనేది చెప్పారు. వాటితో పాటు ఎత్తుడు కూలీలు, సీనరేజీ, జీఎస్‌టీల పేరుతో ఎంత వసూలు చేయాలో కూడా ప్రకటించారు. ఇవన్నీ కలుపుకునే సరికి ఉచితం కాస్తా ఎగిరిపోయింది. మరింత ప్రియమైంది. టన్ను ధర గతం కన్నా సగానికి సగం తగ్గించారు. ఆచరణలోకి వచ్చేసరికి రూ.5 వేలకు పైగానే పెట్టాల్సి వస్తోంది. ఇసుక కోసం ఆన్‌లైన్ బుకింగ్ అన్నారు. ఎక్కడ నుంచైనా అన్నారు. అవేవీ ఆచరణలో పనిచేయడం లేదు. బుకింగ్ ఎక్కడ చేసుకోవాలి? ఎలా చేసుకోవాలో బిల్డర్లకు తప్ప సామాన్యుడికి తెలియడం లేదు. అటూఇటూ తిరిగి బ్లాక్‌లోనే కొంటున్నారు. ఇదంతా ప్రభుత్వ ఇసుక విధానంలో తప్పిదాలు, సమన్వయ లోపం, ఇసుక రీచ్‌లు ▶ 2లో

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

గాజాపై

ఇజ్రాయిల్ దమనకాండ ఆపాలి

- అమెరికా, భారత్ ద్వందవైఖరి విడనాడాలి
- పాలస్తీనాకు దేశ ప్రజలు అండగా నిలవాలి
- ధర్నాలో వామపక్ష నేతల పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యుద్ధంతో నష్టాలే తప్ప ఎటువంటి ఉపయోగం ఉండదని, శాంతి మార్గంలో ప్రపంచం ఆనందంగా వర్ధిల్లుతుందని వామ పక్ష పార్టీల నాయకులు హితవు పలికారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఆపివేయాలని కోరుతూ ఒంగోలు కలెక్టరేట్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ దినం పాటించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి ఏడాది నిండుతుందన్నారు. అమెరికా ప్రోద్బలంతోనే ఇజ్రాయెల్ ఈ దాడులకు పాల్పడుతుందన్నారు ఈ దాడులలో దాదాపు 50 వేల మందికి పైగా సామాన్య ప్రజలు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు మృతి చెందారన్నారు. గాజాపై దాడులను ఇజ్రాయెల్ వెంటనే ఆపాలని ఐక్యరాజ్య సమితి చెప్పినా పెడ చెవినపెడుతుందన్నారు. ఈ విషయంలో అమెరికా ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందన్నారు. గతంలో అలీన ఉద్యమానికి భారతదేశం ▶ 2లో

ప్రేమోన్మాది ఘాతుకం..

- ప్రేమ పేరుతో పదోతరగతి విద్యార్థినిపై వేధింపులు
- నిరాకరించిందని అర్ధరాత్రి వేళ బాలిక కుటుంబంపై కత్తి, సుత్తితో దాడి
- తల్లిదండ్రులతో పాటు బాలికకూ గాయాలు
- నిందితులను శిక్షించాలని జాతీయరహదారిపై కనగాల గ్రామస్తుల ధర్నా
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్షించాలని ఐద్వా డిమాండ్

ప్రేమోన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన మస్తాన్‌వలీ

ప్రజాశక్తి-చెరుకుపల్లి, రేపల్లె

పదోతరగతి విద్యార్థినితో పాటు ఆమె తల్లిదండ్రులపై ప్రేమోన్మాది కత్తి, సుత్తితో దాడికి పాల్పడిన ఘటన చెరుకుపల్లి మండలం కనగాలలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. చెరుకుపల్లి ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చెరుకుపల్లి మండలం కనగాల గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలీ పెద్ద కుమార్తె మండల పరిధిలోని గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. గ్రామంలో హైస్కూల్ లేదు. దీంతో సుమారు ఏడు కిలోమీటర్లు ఆర్టీసీ బస్సు మరియు ఆటోలో బాలిక నిత్యం ప్రయాణం చేస్తూ పాఠశాలకు వచ్చి వెళ్తూ ఉండేది. ఈ నేపథ్యంలో విద్యార్థిని పాఠశాలకు వచ్చి వెళ్లే సమయాలలో చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన కుంచాల భార్గవ్‌రెడ్డి విద్యార్థినిని ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు కుమార్తెను స్కూల్ మానిపించి.. పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ ▶ 2లో

ఘటన వివరాలు తెలుసుకుంటున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

గవర్నర్‌కు స్వాగతం

గవర్నర్‌కు మొక్క అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ బాపట్లకు సోమవారం చేరుకున్నారు. బాపట్ల మండలం, పాండురంగాపురంలోని గోల్డెన్ రిసార్ట్స్‌లో ఆయన బస చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జె.వెంకటమురళి, జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ దామోదర్, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మొక్క అందజేసి..స్వాగతం పలికారు.

కరువు మండలాల

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కరువు మండలాల ప్రతిపాదనలు ఈ నెల 10 లోపు పంపాల్సి ఉందని, అందుకు అనుగుణంగా జిల్లాలో కరువు మండలాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం రెవెన్యూ, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, జలవనరులు, భూగర్భజల శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై.. జిల్లాలో కరువు మండలాల ప్రతిపాద సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరువు మండలాల నిర్ధారణ కోసం ప్రభుత్వం నిర్దేశించిన ఐదు ఇండికేటర్ల ప్రకారం ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు, ఎంత తక్కువ వర్షపాతం నమోదైన వివరాలు, వ్యవసాయ పరంగా గతంలో ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు, ఇప్పుడు ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారనే విషయాన్ని, జిల్లా నీటిపారుదల శాఖ ద్వారా ఎంత విస్తీర్ణం భూమికి నీటిని అందిస్తున్నారనే విషయాల ఆధారంగా కరువు మండలాల ప్రతిపాదనలు ▶ 2లో

ప్రేమోన్మాది ఘాతుకం..

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో విషయం తెలుసుకున్న కుంచాల భార్గవ్‌రెడ్డి అతని స్నేహితుడు విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి ఆదివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో బాలిక ఇంటికి వెళ్లి బాలిక తండ్రిని కత్తి మరియు సుత్తితో దాడి చేశారు. అడ్డుకోబోయిన అతడి భార్య ఆరీఫా, కూతురిపై కూడా కత్తులతో దాడి చేసి.. పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన మస్తాన్‌వలీ, ఆరీఫా, బాలిక రేపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు షేక్ మస్తాన్‌వలీ ఫిర్యాదు మేరకు చెరుకుపల్లి ఎస్సై అనిల్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముద్దాయిలను వెంటనే శిక్షించాలి..
ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రేమోన్మాది చేతిలో దాడికి గురైన మస్తాన్ వలీ కుటుంబాన్ని రేపల్లె ప్రభుత్వ హాస్పటల్లో ఐద్వా, సిపిఎం నేతలు పరామర్శించారు. నిందితులను వెంటనే శిక్షించాలని రేపల్లె ప్రభుత్వ హాస్పటల్ వద్ద ఐద్వా, సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో చెడు వ్యసనాలకు బానిసలైనవారు గంజాయి మత్తులో ప్రేమ పేరుతో విచక్షణారహితంగా దాడులు చేయటం నిత్యం జరుగుతోందని, త్వరితగతిన దోషులకి శిక్షలు పడకపోవడం వల్లే ఇలాంటి దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ముద్దాయిలను 24 గంటల్లో అరెస్టు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి శిక్షలు వేస్తేనే ఈ ప్రభుత్వం మీద మహిళలకు విశ్వాసం ఉంటుందని అన్నారు. సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ చెరుకుపల్లి మండలం పరిధిలో హైస్కూల్‌కి వెళ్తున్న విద్యార్థినులని ప్రేమ పేరుతో వేధిస్తూ దాడులు జరుగుతున్న ఘటనలు పునరావృతమవుతున్న నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ ద్వారా విచారణ చేయాలని, దోషులు బయటకు రాకుండా శిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబానికి ప్రభుత్వం నుండి సహాయం చేయాలని కోరారు. ధర్నా సందర్భంగా రమాదేవి ఫోన్ ద్వారా ఇన్‌ఛార్జి డీఎస్పీ రామాంజనేయులుతో, ఇతర పోలీసు అధికారులతో మాట్లాడారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.వెంకట్రామయ్య, కె.రమేష్, కె.ఆశీర్వాదం, కేవీ.లక్ష్మణ రావు, జే.ధర్మరాజు, జి.దానియేలు, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు వై.నవీన్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో

బాలిక కుటుంబంపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ కనగాల గ్రామస్తులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. నిందితులను 24 గంటల్లోగా పట్టుకునేల చూస్తామని రేపల్లె గ్రామీణ సీఐ సురేష్ బాబు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సమర్పించాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా సంబంధి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కరువు మండలాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత, సిపిఒ డి.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ కె.మాధురి, ఎపిఎంఐపి పీడీ పి.వి.రమణ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబీరాణి, గ్రౌండ్ వాటర్ డిడి విద్యాసాగర్, జిల్లా ఉద్యాన అధికారి వైఎంఎల్ఎన్ గోపీచంద్, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గాజాపై ఇజ్రాయిల్ దమనకాండ ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

నాయకత్వం వహించిందన్నారు. నేడు మోడీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఆయుధాలు, డ్రోన్లు సరఫరా చేయటం సిగ్గుచేటన్న విషయమన్నారు. యుద్ధం అనేక అనర్థాలకు దారి తీస్తుందని మేధావులు చెబుతున్నా పట్టించుకునే నాధుడు లేడన్నారు. ఈపాటికే యుద్ధంలో నివాస ప్రాంతాలు విద్యాలయాలు ధ్వంసమయ్యాయన్నారు. సామ్రాజ్యవాద కాంక్షతో అమెరికా ప్రేరేపిత యుద్ధానికి నేడు ఇజ్రాయెల్ పాల్పడుతుందన్నారు. పశ్చిమాసియా దేశాల ప్రజలు నేడు భయానక పరిస్థితులలో జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇజ్రాయెల్ వారి యుద్ధాన్ని ఆపాలని, దేశ ప్రజలు పాలస్తీనాకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి విడనాడి పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, ఎస్‌కె మాబు, చీకటి శ్రీనివాసరావు, కాలం సుబ్బారావు, నగర కార్యదర్శి జి.రమేష్, బి.రఘురామ్, కంకణాల రమాదేవి, సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు కె.వీరారెడ్డి, ఆర్.రామకృష్ణ, ఎం.విజయ, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి ప్రకాశరావు, శ్రీరామ శ్రీనివాసరావు, వామపక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలకు పైనే.!

(మొదటిపేజీ తరువాయి)

లేకపోవడం వంటి కారణాలతో పాటు దళారుల దందా మరొక ప్రధాన కారణం. ఇసుక అప్పుడూఇప్పుడూ దళారులకు, పాలకపక్ష నేతలకు ఆదాయవనరుగానే మారింది. గుండ్లకమ్మ, చిలకలేరు, పాలేరు నదుల నుంచి ఇసుక వస్తోంది. చినగంజాం వంటి తీరప్రాంతాల నుంచీ వస్తోంది. ఇసుక మాత్రం బయటకు వస్తూనే ఉంది. పాలకపక్ష నేతలు కొందరు ఇసుకను వ్యాపారంగా మార్చేశారు. ట్రక్కుకు ఇంత? లారీకి ఇంత? అని రేటు పెట్టి వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్లు, లారీలు ఉన్న కొందరు ఆ ఇసుకను పట్టణాలు, మండల కేంద్రాల్లోకి తెచ్చి అమ్ముకుంటున్నారు. పాలకపక్ష నేతలకు కప్పం కడితే పోలీసులు కూడా వదిలేస్తారు. ఇదంతా బహిరంగంగా తెలిసిన దందానే. ధరలు పెరగడానికి ఇదొక ప్రధాన కారణంగా చెప్పకతప్పదు. ఉచిత ఇసుక విధానం పకడ్బందీగా అమలులోకి రాలేదు. ఆన్‌లైనులో బుకింగ్ కూడా ఎండమావిగానే మారింది. ఇసుక సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మిగతా ప్రతిపక్ష పార్టీలు కూడా ఇసుక సమస్యపై దృష్టి సారించాయి. ప్రభుత్వం తక్షణం ఇసుక సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

BEFORE THE HON'BLE XII ASSISTANT CITY CIVIL COURT AT CHENNAI
O.S.No. 1622 of 2024
(Under Order XXXVII Rule 1 of the Civil Procedure Code, 1908)

State Bank of India,
Retail Assets Central Processing Centre
MRC Nagar, No.4, Santhome High Road
Mylapore, Chennai-600004. .....**Plaintiff**

-Vs-

Mrs. Asha Shaik, W/o. Hussain Sharif
No.93, Maheswari flats, 1st Street, Eswar Nagar, Thiruverkadu, Chennai - 600 077.
Also at.
Manju foundations private limited
Pioneer Agnitio Park, 7th floor, #141, Kandhanchavadi, Old Mahabalipuram Road, Chennai–600 096.
Also at.
Plot.No.12, Varalakshmi apartment, PNT Colony, Vijayawada, Andhra Pradesh – 520 015.
And also at.
D.No.286, Palem, Near Brundavan beach resort. Kothaparnam village, Ongole, Andhra Pradesh – 523 286. ..... **Defendant**

SUMMON

Whereas the above plaintiff bank has filed the above suit against you for recovery of Rs.7,02,861/- together with future interest at 9.75% with monthly rests from the date of filing the above suit, till the date of realization.Please take notice that the above suit is posted for your appearance (defendants) before the Hon'ble XII Assistant City civil Court, Chennai on 25.10.2024 at 10.30 AM. Therefore, you are hereby requested to be present on that day either in person or through an advocate or otherwise orders will be passed in your absence.

N.Elumalai,
Counsel for Plaintiff.

నోటీసు
మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, ప్రకాశంజిల్లా అద్దంకి
OS No : 91/2020

బిట్విన్
పూసపాటి అశ్రితప్రియ, D/o శ్రీనివాస రెడ్డి వయస్సు 17 సం.లు, మైనరు, తల్లి గార్డియన్ పూసపాటి రజని @ మేకల రజని W/o శ్రీనివాసరెడ్డి .... వాది
మరియు
1) పూసపాటి పట్టాభిరామిరెడ్డి (డైడ్)
2) పూసపాటి శ్రీనివాసరెడ్డి S/o పట్టాభిరామిరెడ్డి కొటికలపూడి (గ్రామం) అద్దంకి (మండలం), ప్రకాశంజిల్లా.
3) మారెడ్డి లక్ష్మి, W/o నారాయణరెడ్డి
4) వెన్న మాధవి W/o జగన్ మోహనరెడ్డి
.....ప్రతివాదులు

పై తెలుపబడిన దావా యందు వాది పలుమార్లు ప్రతివాదులైన 2,3 మరియు 4 ప్రతివాదులకు దావా సమన్లు శ్రీకోర్టువారి ద్వారా పంపియున్ననూ జారీకానందున పేపరు ప్రకటన ద్వారా నోటీసులు తెలియపర్చుటకు శ్రీ కోర్టువారు అనుమతించిన దరిమిల ఈ ప్రకటన చేయడమైనది. కావున పై తెలుపబడిన 2,3 మరియు 4 ప్రతివాదులు ఈ ప్రకటనను నోటీసుగా భావించి తేది: 06-11-2024న ఉ.10.30ని.లకు శ్రీయుత కోర్టువారి సమక్షమందు స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరై తమ ఆక్షేపణలు తెలియపర్చుకోవలవయును లేనిచో పరోక్షముగా తీర్మాణింపబడుదురు.

// శ్రీ కోర్టువారి అనుమతితో //

అద్దంకి
తేది:27-09-2024 ఇట్లు
పిట్టల లక్ష్మయ్య బి.కాం.,బి.యల్,
అడ్వకేట్, ఒంగోలు, అద్దంకి
సెల్ నెంబర్ : 9848835099

ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EA.48/2024
In
EA. 424/2018
In
EP.156/2017
In
OS No : 162/2012

దావులూరి కృపారావు ...పిటీషనర్/Auction Purchaser
వర్సెస్
1.మన్నే రామలింగయ్య .....DHR
2.పమిడి వెంకటేశ్వర్లు .....JDR

To
JDR) పమిడి వెంకటేశ్వర్లు, తండ్రి సుబ్బారావు, డాక్టర్ వృత్తి, లంబాడీ డొంక, పవర్ ఆఫీస్ వద్ద, కర్నూలు రోడ్డు, ఒంగోలు అను వారికి

వేలం జరిగిన నీ తాలూకు ఆస్తిని సేల్ సర్టిఫికేట్ ప్రకారం కోర్టు అమీన్ ద్వారా పిటిషనర్‌కు స్వాధీనం ఇప్పించమని సదరు ఆస్తిలో ఉన్న standing crop ను తొలగించుటకు తేదీని నిర్ణయించి వేలం జరిపించి వచ్చిన sale proceeds ను కోర్టులో జమ చేయించులాగున ఉత్తర్వులు ఇవ్వవలసినదిగా కోరుచూ పిటిషన్ దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం తే.23-10-2024దిన ఉదయం 10.30 నిమిషాలకు వాయిదా ఉన్నందున మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి అనుమతితో //

ఒంగోలు
05-10-2024 ఇట్లు
ముదివర్తి రాఘవరావు
పెళ్ళూరి వసుంధర
అడ్వకేట్లు, సీతారాంపురం, ఒంగోలు

మహారాజశ్రీ ఫ్యామిలీ జడ్జి వారి కోర్టు, ఒంగోలు
F.C.M.C. 19/2024

మాదాల కల్పన మరియు ఇతరులు ... పిటిషనర్లు
మరియు
మాదాల వెంకటేశ్వర్లు ... రెస్పాండెంట్

To
మాదాల వెంకటేశ్వర్లు,
S/o సుబ్బయ్య డోర్ నెంబర్5–369,
వెంకుపాలెం గ్రామం, పొన్నలూరు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబర్ గల కేసులో మీహాజరు నిమిత్తం అనేక పర్యాయములు నోటీసులు జారీ చేసినప్పటికీ మీరు నోటీసులు తీసుకోనందున శ్రీయుత కోర్టువారు పత్రికా ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయమని ఆదేశించినారు. మీ హాజరు నిమిత్తం తేది : 22-10-2024 కివాయిదా వేసినారు .కావున మీరు పై తేదిన ఉదయం 10:30కి పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినది లేనియెడల మీ పరోక్షములో తీర్మానించబడునని తెలియజేయడమైనది

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

ఇట్లు
ఆళ్లహరిబాబు
ఆళ్ల రవిచంద్ర
పిటిషనర్ల తరపు న్యాయవాదులు
ఒంగోలు, ప్రకాశం జిల్లా,
సెల్ : 888623750

ఆర్డర్ 21 రూల్ 34 CPC నోటీసు
ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
EP No : 5/2024
IN
PLC 50/2014

తోకల శ్రీనివాసరావు ...D.H.R
వర్సెస్
మంగమూరి లక్ష్మి ..... J.D.R

To
మంగమూరి లక్ష్మి W/o నాగేశ్వరరావు,
SRరెసిడెన్సి వెనుక, నాగరాజు పల్లి రోడ్డు,
మార్టూరు ప్రకాశం జిల్లా (ప్రస్తుతం బాపట్ల జిల్లా)

యీ నెంబర్ DHR లోక్ అదాలత్ అవార్డు ప్రకారం మీ తాలూకు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని విక్రయపత్రం వ్రాయించి రిజిస్టరు చేయవలసినదిగాను, లేనిచో కోర్టు వారిని మీ తరఫున రిజిస్టరు చేయవలసినదిగా కోరుచు పై నెంబర్ E.Pని దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం తే 17-10-2024 దికి వాయిదా వేసినారు కనుక వాయిదా రోజున ఉదయం 10.30 నిమిషాలకి పై కోర్టులో స్వయంగా గాని లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేనియెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియజేయడమైనది

షెడ్యూలు

ప్రకాశం జిల్లా, మార్టూరు మండలం మార్టూరు గ్రామం D.NO 584/C/A3 దాఖల మార్టూరు గ్రామ పంచాయితీ D.No : 28/11 ఆస్తికి హద్దులు
తూర్పు: చెన్నుపాటి రామకృష్ణ స్థలం –హద్దు బారున 33 అ.లు,**దక్షిణం:** అలపర్తి రమణ,భర్త శ్రీనివాసరావు గారి స్థలం హద్దు బారున 60అ.లు **పడమర** :20 అడుగుల వెడల్పు గల రోడ్డు హద్దు బారున 33 అ.లు, **ఉత్తరం:** కొత్త వెంకటరత్నయ్య స్థలం, హద్దు బారున 60 అ.లు ఈ హద్దుల మధ్య 220 చ.గ.ల తో మొదటి అంతస్తు 1700చ.అ 1500 అ.లు 2వ అంతస్తు RCC బిల్డింగు.

ఇట్లు
అన్నపరెడ్డి సునీత
DHR తరపు అడ్వకేట్,
జిల్లా కోర్టు ఎదురు, ఒంగోలు

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి, కోర్టులో
O.S No: 53/2018

Between:
చల్లగుండ్ల వెంకటేశ్వర్లు .... వాది
Vs
చల్లగుండ్ల వెంకటేశ్వర్లు మరియు ఇరువురు ...... ప్రతివాదులు

To
చల్లగుండ్ల వెంకట సుబ్బారావు S/o వెంకటేశ్వర్లు, చవటిపాలెం గ్రామం, తంగేడు మల్లి పోస్టు, సంతమాగులూరు మండలం, బాపట్ల జిల్లా.
(2వ ప్రతివాది)

పై నంబరు దావాను వాది దావా పరిహారములు పొందు నిమిత్తం దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో 2వ ప్రతి వాదియైన మీకు ఇందును గూర్చి మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా సమను మరియు I.A No.839/2018 నంబరున పిటిషనర్/వాది దాఖలు చేసిన order 39 Rule 1to2 C.P.C ప్రకారం టెంపరరీ ఇంజక్షన్ పిటిషనులో రెస్పాండెంట్ నెంబర్ 2గా చూపబడిన మీకు ఈ విషయమై కూడా ఎన్నిసార్లు నోటీసు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు దావా సమను మరియు పై నంబరు పిటిషనులో 2వ రెస్పాండెంట్ గా చూపబడిన 2వ ప్రతివాదియైన మీకు సదరు పిటిషను నందు నోటీసు జారీ చేయవలసినదిగా కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చిఉన్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 19-11-2024 వ తేది ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, వకీల్ ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్ష మందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలకముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి అనుమతితో//

అద్దంకి ఇట్లు
07-11-2024 **పంచాగ్నుల రమేష్,**
అడ్వకేట్
అద్దంకి, బాపట్ల జిల్లా
సెల్ నెం :99487 88290

దావా సమను
(సి.పి.సి. ఆర్డర్ 5 రూల్ 1 అండ్ 5)
మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం: 153/2023

సయ్యద్ రసూల్ .... వాది
వర్సెస్
షేక్ సుభానీ ...... ప్రతివాది

టు,
ప్రతివాది
షేక్ సుభానీ, వయసు: 40 సం॥
తండ్రి: హమీద్, ముస్లిం,
ఎపిఎస్ఆర్‌టిసి ఉద్యోగి, మార్కాపురం డిపో
ఎంప్లాయి నెం: 628069,
నివాసం: గిద్దలూరు టౌన్ మరియు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది దావా పరిహారం నిమిత్తం అనగా నీవు వాదివద్ద 19-02-2020వ తేదీన రూ. 20,000–00 నగదు తీసుకొని వాది పేర వ్రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటు బాకీని గురించి నీ మీద పై కోర్టులో, పై నెంబరు దావా దాఖలు చేసియున్నాడు. ఇందు విషయమై నీకు పలుమార్లు దావా సమన్లు పంపగా అవి నీకు ముట్టని కారణము చేత ఈ పేపరు దావా సమను ద్వారా నీకు తెలియజేయునది ఏమనగా 25-10-2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయము గా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలసినది. లేని యెడల నీ పరోక్ష మందు దావాను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 25-10-2024
మార్కాపురం **వి.శ్రీనివాసరావు**
అడ్వకేట్, మార్కాపురం.
సెల్: 9440510490.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పిజిఆర్ఎస్‌లో గడువు తీరిన అర్జీలు అపరిస్కృతంగా ఉండరాదని అధికారులను హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ తన పరిధిలోని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తంగా 150 అర్జీలు నమోదయ్యాయి. పిజిఆర్ఎస్‌కు అధికారులు అధిక ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజూ పిజిఆర్ఎస్ డ్యాష్ బోర్డును పరిశీలించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. నమోదైన అర్జీలు పునరావతం కాకుండా చూడాలన్నారు. అర్జీలు పునరావతమైతే అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని భావించాల్సి ఉంటుందన్నారు. గడువు తీరిన అర్జీలు చీరాల ఆర్‌డిఒ పరిధిలో నాలుగు ఉండడం పట్ల ఆరా తీశారు. 21 రెవెన్యూ దరఖాస్తులకు గడువు తీరినప్పటికీ పరిష్కారానికి నోచలేదన్నారు. స్వర్ణాంధ్ర-2047కు సంబంధించి విజన్ బాపట్ల, నూతన ఆవిష్కరణ, ప్రణాళిక రూపొందించేందుకు జిల్లా అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులతో మంగళవారం సమీక్షా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ రైతుల నుంచి నీటి తీరువా పన్నులు వసూలు చేయాలన్నారు. రెవెన్యూ అంశాలపై నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటమురళి

అదుపుతప్పి కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-కనిగిరి

కారు అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ముగ్గురికి గాయా లయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పొదిలికి చెందిన చెక్క అశోక్ కుమార్ తన భార్య, కుమారుడుతో కలసి ప్రొద్దుటూరు వెళ్తున్నాడు. ఘటన స్థళం వద్దకు వచ్చేసరికి కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. అశోక్‌కుమార్, ఆయన భార్య, కుమారుడికి గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం తెలుసుకున్న సిఐ షేక్ ఖాజావలి, ఎస్ఐ తుళ్లూరు శ్రీరామ్ తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కనిగిరి వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫాగింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

సేంద్రియ వ్యవసాయానికి పాధాన్యం

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రసాయనాలు లేకుండా సాగు చేసిన కూరగాయల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. రసా యనాలు లేకుండా పండించిన కూరగాయల విక్రయ కేంద్రాన్ని కలెక్టరేట్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ దిశగా ముందుకు వచ్చిన రైతులకు మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తద్వారా రైతులకు ఆదాయంతో పాటు వినియోగదారుల ఆరోగ్యం కూడా పదిలంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా డబ్బులు ఇచ్చి రైతుల వద్ద కూరగాయలు కొనుగోలు చేశారు. మరిన్ని ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎపిసిఎన్ఎఫ్ డిపిఎం సుభాషిణికి సూచించారు. ముఖ్యంగా ప్రతి సోమవారం గ్రీవెన్స్ రోజున కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు కొనుగోలు చేసేలా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సేంద్రీయ ఉత్పత్తుల వినియోగంతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ కూడా ఈ విక్రయ శాలలో కూరగాయలు కొనుగోలు చేశారు.

కూరగాయలు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నిషేధిత జాబితా నుంచి తొలగించిన

భూముల వివరాలివ్వాలి

జాయింట్ సెక్రెటరీ జయలక్ష్మి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలు పక్కాగా ఇవ్వాలని సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీ జయలక్ష్మి ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో రాజధాని నుంచి సోమవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హాజరయ్యారు. నిషేధిత భూముల జాబితా నుంచి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగినవి.. చట్టాన్ని ఉల్లంఘించిన వాటి వివరాలు స్పష్టంగా పంపాలని సిసిఎల్ఎ జాయింట్ సెక్రెటరీ తెలిపారు. ఇప్పటికే ఇచ్చిన వివరాలను పున్న పరిశీలించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ జరిగిన భూముల వివరాలను నివేదికలో పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

బూరేపల్లిలో ఫాగింగ్

ప్రజాశక్తి-మద్దిపాడు :

మండల పరిధిలోని బూరేపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమల నివారణ ముందస్తు చర్యలలో భాగంగా సోమవారం ఫాగింగ్ నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ సూచనలు మేరకు గ్రామ సర్పంచి అయ్యమ్మ శేషయ్య ఆధ్వర్యంలో ఫాగింగ్ చేశారు. ఇంటింటా ఫాగింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి పాతులూరు శ్రీనివాసులు, సిహెచ్ఒ లలితమ్మ, హెచ్‌వి సీతమ్మ, దరియా, ఎఎన్ఎం ఉమా, ఎంఎల్‌హెచ్‌వి శ్రీజ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ అనీల్ కుమార్

రక్షిత నీటిని తాగాలి

ప్రజాశక్తి-టంగుటూరు

పిల్లలు, పెద్దలు, గర్భిణులు, బాలింతలు, కిడ్నీ రోగులు, ఇతర వ్యాధులు ఉన్న వారు రక్షిత నీటిని తాగాలని డాక్టర్ వి. అనీల్‌కుమార్ తెలిపారు. జరుగుమల్లి మండల పరిధిలోని మండలంలోని చిరికూరపాడు గ్రామంలో ఫ్లోరోసిస్ గురించి తెలుసుకుందాం అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనీల్ కుమార్ మాట్లాడుతూ తాగు నీటిలో అనుమతించదగు ఫ్లోరైడ్ పరిమితి ఆయా స్థలం, ఉష్ణోగ్రతను బట్టి 0.50 నుంచి 1050 పిపిఎం వరకూ ఉండవచ్చునన్నారు. ఎముకలు, దంతాలకు ఫ్లోరోసిస్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఫ్లోరోసిస్ రాకుండా ఉండాలంటే రక్షి నీటిని తాగాలన్నారు. ప్రోటీన్లు ఎక్కువుగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కాల్షియం కోసం పాలు, పెరుగు, ఆకుకూరలు, మునగ, జీలకర్ర, బెల్లం ఆహారంలో తీసుకోవాలన్నారు. వెజిటబుల్ ఆయిలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, ఉసిరి, నిమ్మ, జామ, నారింజ, టమోటా తీసుకోవాలన్నారు. జీర్ణక్రియ సక్రమంగా జరిగేందుకుకు వెల్లుల్లి, అల్లం, ఉల్లి, క్యారెట్, బొప్పాయి. స్వీట్ పొటాటో సుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కావ్య, డాక్టర్.వి. అనీల్ కుమార్, కె. అంజిరెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాచండీదేవీగా

వల్లూరమ్మ తల్లి దర్శనం

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో వెలసియున్న వల్లూరమ్మ తల్లి దసరా శరన్నవరాత్రులలో భాగంగా ఆదివారం శ్రీ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దసరా శరన్నవరాత్రులలో భాగంగా శ్రీవల్లూరమ్మను సుందరంగా అలంకిరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ఇఒ బి.రమేష్ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం తగు ఏర్పాట్లు చేశారు.

శ్రీ మహాచండీదేవి రూపంలో వల్లూరమ్మ

ఘనంగా దేవీనవరాత్రి వేడుకలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

దసరా పండగ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో దేవీనవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మనబ్రోలు చెన్నమల్లేశ్వర దేవస్థానంలో ఇఒ వెలగం శ్రీనివాస్ ఆద్వర్యంలో ప్రత్యేక అలంకరణలో పూజలు నిర్వహిస్తున్నారు ఉప్పుగుండూరులో దిన్నెమీద కనగాల రామకృష్ణ ఆధ్వర్యంలో దేవినవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉప్పుగుండూరు యూనియన్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద దేవినవరాత్రుల వేడుకల్లో భాగంగా పేర్నమిట్ట మహిళలు ఆదివారం రాత్రి కోలాటం ప్రదర్శించారు. కోలాటం బృదంలో చిన్నారి హర్షిణి ప్రతిపాటకు లయతప్పకుండా కోలాటం ప్రదర్శించడంతో పలువుర్ని ఆకట్టుకుంది. దీంతో చిన్నారికి పలువుఉఉ పోటాపోటాగా డబ్బులు గుచ్చారు. . చీర్వానుప్పలపాడు తదితర గ్రామాల్లో దసరా వేడుకలు నిర్వహిస్తున్నారు.

రూ. 40లక్షలతో లక్ష్మీ దేవి అలంకరణలో దుర్గాదేవి

రూ.40 లక్షలతో లక్ష్మిదేవిగా అలంకరణ

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దిన్నెమీద కనగాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఎర్పాటు చేసిన దుర్గాదేవిని సోమవారం రాత్రి రూ. 40 లక్షల రూపాయలతో లక్ష్మిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న నరేంద్ర వర్మ

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం

ప్రజాశక్తి బాపట్ల

వ్యక్తిగత పర్యటన నిమిత్తం సోమవారం బాపట్లకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ పుష్పగుఛ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.

వాసవీ ఆలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

గొట్టిపాటికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - అద్దంకి

స్వస్తి శ్రీ క్రోధి నామ సంవత్సరం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ చక్ర సహిత శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ ఆహ్వానం మేరకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఆలయానికి వచ్చారు. ఆయనకు మేళ తాళాలతో వేద పండితుల మంత్రోఛ్ఛరణలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని మంత్రి రవికుమార్ దర్శించుకున్నారు. శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హిమవర్ధిని దేవిగా దర్శనమిస్తున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు, చెడును నాశనం చేసి గ్రహ పీడలు తొలగించే ఆ హిమవర్ధినిదేవి అనుగ్రహం, ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, స్థానిక టిడిపి నేతలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు రాధాకృష్ణమూర్తి మృతి

ప్రజాశక్తి - పంగులూరు

వడ్డే రాధాకృష్ణమూర్తి (ఫైల్)

పంగులూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వడ్డే రాధాకృష్ణమూర్తి(90) ఆదివారం రాత్రిమరణించారు. వయోభారంతో కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన ఆరోగ్యం క్షీణించటంతో మ ృతి చెందారు. ఉపాధ్యాయునిగా 40ఏళ్లు సేవలు అందించారు. పంగులూరులో స్వతహాగా పాఠశాలను ఏర్పాటు చేసి అందులో గ్రామంలోని అనేక మంది విద్యార్థులకు పాఠాలు చెప్పారు. అందువలన ఆ పాఠశాలకు 'వడ్డే వారి బడి'అని పేరు వచ్చింది. పంగులూరులోని సుదీరకాలం పనిచేసిన ఆయన తరువాత కొద్ది కాలం బయట గ్రామాల్లో పనిచేశారు. ఆయన భార్య సత్యవతిదేవి కూడా హిందీ ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రసాద్ నరసరావుపేట శ్రీ చైతన్య కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. కుమార్తె లక్ష్మీ సరస్వతి కూడా అక్కడే పని చేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు సోమవారం పూర్తయ్యాయి. ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులు అడ్డగిరి రాఘవులు, చందలూరు నారాయణరావు మొదలైన విద్యార్థులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

వరద ప్రభావిత చేనేత కుటుంబాలను ఆదుకోవాలి

- మంగళగిరి తరహాలో సహాయం అందించాలని డిమాండ్
- చేనేత కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అధిక వర్షాల కారణంగా మగ్గం గుంటల్లో నీరు చేరి ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటియుసి) రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల కారణంగా మగ్గం గుంటల్లోకి వర్షపు వర్షపు నీరు చేరి ఉపాధిని కోల్పోయిన చేనేత కార్మికులకు మంగళగిరి తరహాలో ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకులు అందించి ఆదుకోవాలని కోరారు. చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారుకు చేనేత కార్మికులు వినతి పత్రాన్ని సోమవారం అందించారు. చేనేత కార్మికులు 20 రోజులకుపైగా పనులు లేక రోజు గడవక అనేక కష్టాలు ఎదుర్కోవడంతోపాటు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాను ముంపు జిల్లాగా ప్రకటించిన ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చేనేత కార్మికులకు నిత్యవసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘాల నాయకులు దీపాల సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, కొడాలి రామకోటేశ్వరరావు, దీపాల సాంబశివరావు, జె నాగభూషణం, కె చలపతిరావు, ఆకురాతి శ్రీనివాసరావు, లక్ష్మీ కాంతారావు, రామ సుబ్బారావు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

చెరుకుపల్లి తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

చెరుకుపల్లి : ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారుకు వినతి పత్రాలు అందజేసి ధర్నా నిర్వహించారు. ఎపి చేనేత కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సిఐటియు జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం ఐఎఫ్టియు న్యూ జిల్లా నాయకులు మర్రివాడ వెంకటరావు మాట్లాడుతూ 20 రోజులకుపైగా ఉపాధి కోల్పోయి, భారీ వర్షాలకు నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. మంగళగిరి ప్రాంతంలో చేనేత కార్మికులకు నష్టపరిహారం అందజేశారని, అదేవిధంగా రేపల్లె ప్రాంతంలో చేనేత కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహశీల్దారు సిహెచ్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఈపాటికే అనేక సమస్యలతో సతమతం అవుతున్న చేనేత కార్మికులు ఉపాధి కోల్పోవడం ఇబ్బందిగా ఉందని తెలిపారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో చేనేత కార్మికులను ఆదుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘ నాయకులు కొడాలి రామకోటేశ్వరరావు, నాగ మల్లేశ్వరరావు, గొట్టిముక్కల మురళి, దొంతు శ్రీనివాసరావు, కె సీతారామయ్య, దీపాల సత్యనారాయణ, వెంకటరమణ, ఓరుగంటి ప్రసాద్ పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ ఆపాలి

ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

ఇజ్రాయిల్ సైన్యం పాలస్తీనాపై చేస్తున్న యుద్ధాన్ని ఆపేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ఆక్రమిత ప్రాంతాల నుండి ఇజ్రాయిల్ సైన్యం వైదొలగాలని ఐక్య రాజ్య సమితి చేసిన తీర్మానానికి కట్టుబడాలని అన్నారు. ఇజ్రాయిల్ పాలిస్తీ యూనిలపై యుద్ధం ప్రారంభించి నేటికి ఏడాది పూర్తి కావస్తోందని అన్నారు. ఇప్పటికీ పాలస్తీనిలు 85వేల మంది అమాయక ప్రజలను అమెరికా, బ్రిటన్ వత్తాసుతో ఇజ్రాయిల్ సైన్యం హతమార్చిందని అన్నారు. ఇజ్రాయిల్ సైన్యం బాంబులతో మారణ హెూమం స ృష్టిస్తోందని అన్నారు. ప్రపంచ శాంతికి ముప్పు కలిగిస్తున్న ఇజ్రాయులకు భారత ప్రభుత్వం ఆయుధ సరఫరా నిలిపివేయా లని డిమాండ్ చేశారు. ఇజ్రా యిల్ దురాక్ర మణ ప్రపంచ శాంతికి ముప్పుగా మారే ప్రమాదం ఉందని ఆందో ళన వ్యక్తం చేశారు. పశ్చిమ ఆసియాను ఇజ్రాయిల్ నిప్పుల కొలిమిగా మార్చేసిందని అన్నారు. లెబనాన్, ఇరాన్, సిరియా, యెమన్, ఇరాక్‌లపై ఇజ్రా యిల్ సైన్యం చేస్తున్న దాడులు దుర్మార్గమని అన్నారు. భారత ప్రభుత్వం ఇజ్రా యిల్ సైన్యాలకు ఆయుధాలు సరఫరా చేయటం, ఐక్య రాజ్య సమితి యుద్ధాన్ని ఆపేయాలని చేసిన తీర్మానంపై సంతకం పెట్టకపోవడం సరైంది కాదన్నారు. ప్రపంచ శాంతికి ముప్పు తెస్తున్న ఇజ్రాయిల్ చర్యలను ఖండించాలని కోరారు. ప్రపంచ శాంతి కోసం ఐక్య రాజ్య సమితి చేసిన తీర్మానంపై భారత ప్రభుత్వం సంతకం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, కె నాగేశ్వరరావు, కె శరత్, నితిన్, చిన్ని పాల్గొన్నారు.

మార్టూరు : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, ప్రపంచ శాంతి కోసం అన్ని దేశాలు కృషి చేయాలని సిఐటియు నాయకులు విజ్ఞప్తి చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు బత్తుల హనుమంతరావు ఆధ్వర్యంలో స్థానిక స్టేట్ బ్యాంక్ సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిని కోరుతూ మార్టూరులో సిఐటియు నిరసన

మంత్రి గొట్టిపాటితో మాట్లాడుతున్న మహిళలు

గుండకమ్మలో స్నానఘాట్‌లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - అద్దంకి

కార్తీక మాసం సందర్భంగా భక్తులు స్నానమాచరించేందుకు అద్దంకి పట్టణంవైపు నుండి గుండ్లకమ్మ బ్రిడ్జికి ఇరువైపులా రెండు స్నాన ఘాట్‌లను, పాత గాంధీ బొమ్మసెంటర్ రోడ్డు, నర్రావారిపాలెం రోడ్డులలో నాలుగు స్నాన ఘాట్లను ఏర్పాటు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయ భక్తులు కోరారు. ఆలయ సందర్శనకు మంత్రి సోమవారం వచ్చిన సందర్భంగా ఆయనను కోరారు. మున్సిపాలిటీ ద్వారా ఏర్పాటు చేయించేందుకు ఆయనకు వినతి పత్రం అందజేశారు. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు ఉండే విధంగా చేయాలని కోరారు. దీనితోపాటు సింగరకొండ చుట్టూ గిరి ప్రదర్శనలు జరుపుకునేలా ఏర్పాటు చేయించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఊటుకూరి ఉమా, అన్నపూర్ణ, వాసవి వనితా క్లబ్ అధ్యక్షులు గ్రంధి నాగరాజు కుమారి, రమాసుందరి, చండూరు కాళీ ప్రసన్న, వి విజయలక్ష్మి, బి శ్వేత, ధూళిపాళ్ల వెంకటరత్నం, సిహెచ్ అంజనీ దేవి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు దేవరపల్లి గ్రామస్తురాలు తోకల సుబ్బాయమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, రోటరీ సభ్యులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది సూచన మేరకు 10 థర్మామీటర్లు సమకూర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ల సేవలను కొనియాడారు. సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య శ్రీ, హెడ్ నర్స్ రత్న కుమారి, రోటరీ సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం, కోట శ్రీనివాసరావు, దూల్లిపాళ్ళ సత్యనారాయణ, కాసా అశోక్ కుమార్ పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న తోకల కృష్ణమోహన్

సిడిపిఒ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - రేపల్లె

సిడిపిఒ ఎం సుచిత్ర

స్థానిక ఐసీడీసీఎస్ ప్రాజెక్ట్ నూతన సిడిపిఓగా ఎం సుచిత్ర సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రాజెక్టు ఉద్యోగులు ఆమెకు శాలువాతో ఘనంగా సన్మానించారు. వేటపాలెంలో విధులను నిర్వహిస్తూ డిప్యుటేషన్‌పై రేపల్లె వచ్చినట్లు ఆమె తెలిపారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలి

వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-టంగుటూరు

ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం రెండు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కాదని, పాలస్తీనా భూభాగాన్ని దౌర్జన్యంగా అక్రమించేందుకు ఆమెరికన్ సామ్రాజ్యవాదుల అండతో సాగిస్తున్న అమానుష యుద్ధమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు తెలిపారు. పాలస్తీనాపై యుద్ధం ఆపాలని, ప్రపంచ శాంతిని కాపాడాలని కోరుతూ వామపక్షాల ఆధ్యర్యంలో పాలస్తీనాకు సంఫీుభావంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి వి.మోజెస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబరు 7న యుద్ధం ప్రారంభమైనట్లు తెలిపారు. హమాస్ సంస్థలను నిర్వీర్యం చేసే లక్ష్యంతో యుద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయిల్ వేలాది మంది ప్రాణాలు తీస్తూ ప్రపంచ యుద్ధానికి ఉసిగొల్పుతుందన్నారు. ఇప్పటికే పాలస్తీనా భూభాగం లోని 65 శాతం భవనాలు, 60 శాతం పంట భూములు ధ్వంసం చేసినట్లు తెలిపారు. పెద్దఎత్తున ఆసుపత్రులు, విద్యా సంస్థలు, ప్రార్ధనా మందిరాలు కూల్చివేసినట్లు తెలిపారు. ఈ యుద్ధం ఉధృతం కావాలని, ప్రపంచ యుద్ధంగా మారాలని అమెరికా లాంటి దేశాలు కోరుకుంటున్నాయని తెలిపారు. ప్రపంచంలో నిత్యం యుద్ధం జరుగుతుంటే తాము ఉత్పత్తి చేస్తు్న ఆయుధాలు, యుద్ధ సామగ్రి అమ్ముడు పోతాయని అమెరికా కోరుకుంటుందని తెలిపారు. తక్షణమే యుద్ధం ఆపి శాంతిని నెలకొల్పాలని ఆయన కోరారు. సిపిఐ మండల కార్యదర్శి టంగుటూరి ప్రభాకర్ మాట్లాడుతూ యుద్దంలో ఇప్పటికే 45 వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. 90 వేల మందికి పైగా క్షతగాత్రులయ్యారని తెలిపారు.మ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఎం. నాగరాజు మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై చేస్తున్న యుద్ధం క్రమంగా విస్తరించి చుట్టు ప్రక్కల దేశాలకు చుట్టుకున్నట్లు తెలిపారు. ఫలితంగా సిరియా, లెబనాన్, ఇరాన్ దేశాలు ఈ యుద్ధంలోకి వచ్చాయని తెలిపారు. ఇది మరో ప్రపంచ యుద్ధంగా మారే ప్రమాదం ఉందన్నారు. సిపిఎం నాయకుడు కెజి.మస్తాన్ మాట్లాడుతూ పాలస్తీనాలోని గాజాస్ట్రిప్, వెస్ట్ బ్యాంకు ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆక్రమించినట్లు తెలిపారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలను కూడా లెక్క చేయకుండా ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని భారత ప్రభుత్వం ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టంగుటూరి రాము, వి.మోజెస్, కొల్లాబత్తిన శ్రీను, టి.నారాయణరావు, టి. పాపారావు, గడ్డం సాల్మన్, సిపిఐ నాయకులు బాలకోటయ్య, న్యూడెమోక్రసీ నాయకుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం సభ్యుడు ప్రసాద్‌కు నివాళి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం నిడమానూరు గ్రామానికి చెందిన సిపిఎం సభ్యుడు ఊదరగుడి ప్రసాదు సంతాపసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాదు మృతి పార్టికీ, ప్రజాఉద్యమాలకు తీరని లోటని తెలిపారు. ప్రసాద్ 1996 నుంచి సిపిఎం సభ్యుడిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. శాఖా కార్యదర్శిగా చేశారన్నారు. గ్రామంలో కూలీ పోరాలు, భూపోరాటాలు, ఇంటి స్థలాలు తదితర ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడినట్లు తెలిపారు. ప్రజల్లో మంచి గుర్తింపు పొందారన్నారు. యువత ప్రసాదును స్ఫూర్తిగా తీసుకొచిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ప్రసాద్‌కు నివాళులర్పించిన వారిలో సిపిఎం కంట్రోల్ కమిటీ చైర్మన్ , రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జె.జయంతిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, ఉబ్బా ఆదిలక్ష్మి, కంకణాల ఆంజనేయులు, సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్, నాయకులు ఉబ్బా వెంకటేశ్వర్లు, సంజీవ, కె. శ్రీను, ఉప్పుగుండూరి వెంకటేశ్వర్లు, ప్రజాశక్తి సర్కులేషన్ ఇన్‌ఛార్జి ఎ.బ్రహ్మయ్య, జర్నలిస్ట్ స్టాలిన్ ఉన్నారు.

శంకరన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

పేదల పక్షపాతి శంకరన్ : కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పేదల పక్షపాతిగా పనిచేసిన ఎస్ఆర్ శంకరన్ ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నారని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. ఎస్ఆర్ శంకరన్ 14వ వర్ధంతికలెక్టరేట్ ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో నున్న ఎస్ఆర్ శంకరన్ విగ్రహానికి కలెక్టర్ జె.వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ పుష్ప మాలలతో ఘనంగా నివాళులర్పించారు. నిజాయితీగా పనిచేసి ఎంచుకున్న లక్ష్యాలను చేరుకున్న గొప్ప వ్యక్తి ఎస్ఆర్ శంకరన్ అని కలెక్టర్ చెప్పారు. ఆయన అడుగుజాడల్లో ప్రభుత్వ ఉద్యోగులు నడవాలని సూచించారు. పద్మభూషణ్ అవార్డును ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సున్నితంగా తిరస్కరించి పేదల పక్షపాతినంటూ తన ఔనత్యాన్ని శంకరన్ చాటుకున్నారని వివరించారు. బెటర్ ఫర్ బాపట్ల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తృత్వ పోటీలలో విజేతలైన ప్రీతిశ్రీ, కావ్యలకు కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. వరదల సమయంలో విశేషంగా సేవలందించిన కలెక్టర్ మురళి, జేసీ ప్రఖర్ జైన్‌లను సంస్థ ప్రతినిధులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ పి.గ్లోరియా, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు, బెటర్ ఫర్ బాపట్ల సంస్థ అధ్యక్షుడు సాయిబాబు పాల్గొన్నారు.

బాణాసంచా గోడౌన్‌లలో...

నిబంధనలు పాటించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని బాణాసంచా గోడౌన్‌లను డిఎస్‌పి యు.నాగరాజు సోమవారం తనిఖీ చేశారు. ప్రమాదాలకు తావులేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. చిన్న ప్రమాదం కూడా జరగరాదన్నారు. బొంతల శ్రావణ్‌కుమార్, వేముల కేశవరావులకు చెందిన టపాసుల గోడౌన్‌లను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి ఎస్‌ఐ అంకమరావుతో చర్చించారు. డిఎస్‌పి వెంట మార్కాపురం సిఐ పి.సుబ్బారావు ఉన్నారు.

బాణాసంచా దుకాణ పరిశీలనలో డిఎస్‌పి నాగరాజు

డిఎంహెచ్‌గా డాక్టర్ రత్నావళి నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిగా పి.రత్నావళిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిగా విధులు నిర్వహించిన డాక్టర్ పి.రాజ్యలక్ష్మి ఈ ఏడాది ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ ప్రస్తుతం ఇన్‌ఛార్జి డిఎం,హెచ్‌ఒగా విధులు నిర్వహి స్తున్నారు. డాక్టర్ పి.రత్నావళి గతంలో ప్రకాశం జిల్లా డిఎం,హెచ్‌ఒగా పనిచేసిన సంగతి తెలిసిందే. డాక్టర్ రత్నావళి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమెను ప్రకాశం జిల్లా డిఎం,హెచ్‌ఒగా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. డిఎం,హెచ్‌ఒగా నియమితులైన డాక్టర్ పి.రత్నావళి రెండు, మూడు రోజులలో విధులలో చేరనున్నారు.

లక్ష్మీ దీపికను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండలపరిధిలోని గమండ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత హైస్కూల్ విద్యార్థిని పాదాల లక్ష్మీదీపిక జాతీయ సాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఆపాఠశాల ప్రధానోపాధ్యాయుడు పత్తిపాటి శ్రీనివాసరావు తెలిపారు.ఎస్‌జిఎస్‌ఐ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 2 నుంచి 5 వరకూ నిర్వహించిన రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. లక్ష్మీ దీపిక 58 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఈనెల 23 నుంచి 27 వరకూ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పోటీల్లో లక్ష్మీదీపిక పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లక్ష్మీదీపికను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ తాతా వెంకట్రావు, గ్రామ సర్పంచి బద్దెల జాలిరెడ్డి, రమణమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పీడీ చెక్కా వెంకటేశ్వర్లు, బండ్ల కిరణ్ కుమార్ అభినందించారు.

వేలం నిర్వహణాధికారిని సన్మానిస్తున్న రైతులు

వేలం నిర్వహణాధికారికి సన్మానం

ప్రజాశక్తి-టంగుటూరు : టంగుటూరు పొగాకు బోర్డు పరిధిలో పొగాకు వేలం ముగిసినట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. గత సీజను తో పోలిస్తే అన్ని గ్రేడులకు మంచి ధరలు లభించినట్లు తెలిపారు. అధీకృత పొగాకు విక్రయాలకు జరిమానాల రద్దు చేసినట్లు తెలిపారు. అనంతరం వేలం నిర్వహణా ధికారి శ్రీనివాసరావు, పొగాకు కొనుగోలు దారులు, బోర్డు సిబ్బందిని రైతులు సన్మానించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-పొన్నలూరు : ఎంపిడిఒ సుజాత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. కొద్ది మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంపిడిఒ సుజాత మాట్లాడుతూ అధికారులందరూ సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పారిశుధ్యం మెరుగుదలపై శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె. మాధవ, జడ్‌పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

రేషన్ డీలర్లతో సమావేశం

ప్రజాశక్తి-మద్దిపాడు : రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడొద్దని తహశీలార్దు సుజన్ కుమార్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రేషన్ పంపిణీలో మద్దిపాడు మండలం వెనుకబడి ఉందని,అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.. త్వరలో ఎండియు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

నందం అబద్ధయ్యను కలిసిన నాయకులు

పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌గా నందం అబద్ధయ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మండలంలోని టిడిపి నాయకులు కొలిమి దోల శివకుమార్, మాచర్ల నాగరాజులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ ద్వారా చేనేత కార్మికులకు అబద్ధయ్య ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు జరుగుతాయని ఆకాంక్షించారు. పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేస్తానని అబద్ధయ్య చెప్పినట్లు వివరించారు. కార్యక్రమంలో పలువురు పద్మశాలియ సంఘ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఇఒఆర్‌డిగా సుమంత్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పంగులూరు

ఈఒపీఆర్డిగా కె సుమంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆయన వలేటివారిపాలెం మండలంలో పనిచేశారు. బదిలీపై సోమవారం పంగులూరు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్చార్జి ఈఒపీఆర్డిగా బి రాంబాబు వ్యవహరిస్తున్నారు. ఆయన ప్రస్తుతం పంగులూరు పంచాయతీ సెక్రటరీగా ఉన్నారు. గత సంవత్సరం ఇక్కడ పిఒపిఆర్డిగా రాజ్యలక్ష్మి బదిలీపై వెళ్లడంతో రాంబాబు ఇన్చార్జిగా వచ్చారు. సంవత్సర కాలంగా ఆయన ఇన్చార్జిగా ఉన్నారు. ప్రస్తుతం సుమంత్ పూర్తిస్థాయి ఈఒపిఆర్డిగా బాధ్యతలు స్వీకరించారు.

ఈఓపిఆర్‌డిగా కె సుమంత్

పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివకుమార్

లోతుకెళ్లి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి - చీరాల

సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు సముద్ర స్నానాల్లో జాగ్రత్తలు పాటించాలని, ఈత కోసం లోతుకు వెళ్లి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ పర్యాటకులకు సూచించారు. మండలంలోని వాడరేవు తీరంలో ఆయన సోమవారం పర్యటించారు. పర్యాటకులకు పలు సూచనలు చేశారు. పర్యాటకులు సముద్ర స్నానాల సమయంలో పోలీసులు నిర్దేశించిన లోతులోనే మునిగి సురక్షితంగా ఉండాలని అన్నారు. పర్యాటకులు సముద్రంలో ఏర్పాటు చేసిన జెండాల గుర్తులను అనుసరిస్తూ స్నానాలు ఆచరించి కుటుంబ సభ్యులతో సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని కోరారు. గతంలో సముద్ర తీరంలో మృతి చెందిన పలువురి గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు. వాతావరణ మార్పుల సమయంలో సముద్రంలో మార్పులను తెలుసుకుని మునగాలని సూచించారు. అత్యుత్సాహంతో ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. పర్యాటకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ క్రీడల్లో బాపట్లకు పతకాలు

ప్రజాశక్తి - బాపట్ల

యుటిఎఫ్ స్వర్ణోత్సవ క్రీడల్లో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు అత్యధిక పతకాలు సాధించినట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జడ వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ నెల 4, 5, 6 తేదీల్లో గుంటూరు ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో పురుషులు, మహిళలకు విడివిడిగా ఆటల పోటీలు నిర్వహించారు. రన్నింగ్, వాకింగ్, షాట్ పుట్, జావలిన్ త్రో, చెస్, క్యారమ్స్, వాలీబాల్, క్రికెట్, స్లో సైక్లింగ్ , టెన్నికాయిట్ క్రీడా పోటీల్లో విజేతలను ప్రకటించారు. క్యారమ్స్ డబుల్స్‌లో మార్టూరుకు చెందిన అట్లూరి ప్రశాంత్, సంతమాగులూరుకు చెందిన చందోలు జిలాని ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకున్నట్లు తెలిపారు. షాట్ పుట్ 45 ఏళ్ళ విభాగంలో చెరుకుపల్లికి చెందిన తాతా సుబ్బారావు ప్రథమ స్థానం, మైలవరం జడ్పీహెచ్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయిని లావణ్య జావలిన్ త్రో లో ద్వితీయ స్థానం, 45ఏళ్ళ నడక విభాగంలో అమృతలూరు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె నిరీక్షణరావు ద్వితీయ స్థానం, మార్టూరుకు చెందిన కె జాకబ్ 45ఏళ్ల జావలిన్ త్రో లో తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. స్వర్ణోత్సవ సంబరాలు డిసెంబర్ 14, 15, 16, 17 తేదీల్లో కాకినాడలో జరుగనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి యుటిఎఫ్ క్రీడా పోటీల్లో విజేతలైన ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. స్వర్ణోత్సవ క్రీడల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి క్రీడల్లో జిల్లాకు గుర్తింపు తెచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

బహుమతులు అందజేస్తున్న కెఎస్ లక్ష్మణరావు

విజన్ 2047పై ఎంఎల్ఎ ఏలూరి టెలీకాన్ఫరెన్స్

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఆంధ్రప్రదేశ్ విజన్ 2047పై పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కార్యకర్తలతో సోమవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐదువేలకు మందిపైగా కార్యకర్తలు కనెక్ట్ అయ్యారు. వారిలో వంద మంది నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సంబంధించిన గ్రామాల సమస్యలను ఆయకు వివరించారు. స్వాతంత్రం వచ్చి మనకి 2047కు 100 సంవత్సరాలు పూర్తి అవుతున్నదని, అందులో భాగంగా రాష్ట్ర అభివృద్ధికి విజన్ 2047 డాక్యుమెంటరీని రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రూపొందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు గ్రామాలతో పాటు పట్టణాలు అభివృద్ధి చేయుటకు కావలసిన మౌలిక వసతుల కల్పన గురించి, అందులో పొందుపర్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు కావలసిన మౌలిక వసతులు భవిష్యత్తులో ఎలా అభివృద్ధి చేయాలన్న అంశంపై మాట్లాడారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఎక్కువ మంది గ్రామాల్లో మురుగు కాలువలు, రోడ్లు, విద్యా, వైద్యం అభివృద్ధి, గ్రామాల్లో చెరువుల అభివృద్ధి. సాగర్ పంటకాల్వల అభివృద్ధి, కొమ్మమూరు కాల్వ అభివృద్ధిని కోరారు.

ఏలూరి సాంబశివరావు

మార్టూరులో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదనలు

ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ మార్టూరులో భవిష్యత్తులో ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి ప్రతిపాదనలు పెట్టినట్లు తెలిపారు. పాత మద్రాసు రోడ్డు గుంటూరు నుంచి ఒంగోలు వరకు నాలుగు లైన్ల అభివృద్ధికి ప్రతిపాదించినట్లు తెలిపారు. రోడ్డు వ్యవస్థ గ్రామం నుంచి మరో గ్రామానికి బాగుంటే గ్రామాలు త్వరగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. గ్రామాల్లో లింకు రోడ్లు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కొలలపూడి, నాగండ్ల, ఇంకొల్లు రోడ్డు త్వరలో అభివృద్ధి చెయనున్నట్లు తెలిపారు. చింతగుంపల, కడవకుదురు, చిన్నగంజాం గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. యద్దనపూడి, పర్చూరు, మార్టూరు గ్రామాలకు సంబంధించి సమస్యలు విన్నవించారు. పర్చూరు నుంచి పిడుగురాళ్ల హైవే రోడ్డులో భాగంగా యదనపూడి, మార్టూరు మండలాల్లోని గ్రామాలకు అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ఇంకొల్లులో మిర్చి యార్డు ఏర్పాటు, అన్ని గ్రామాల్లో మంచినీటి సౌకర్యం కల్పించేందుకు వాటర్ ప్లాంట్లు ఏర్పాటు, చెరువుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, అన్ని మతాల స్మశానాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

మోటుపల్లిలో నౌకాయాన అభివృద్ధికి ప్రతిపాదనలు

సముద్ర తీర ప్రాంతమైన మోటుపల్లి నుంచి వివిధ ప్రాంతాలకు వివిధ సరుకులు ఎగుమతి చేసిన చరిత్ర ఉందని అన్నారు. మోటుపల్లి ప్రాంతాన్ని నౌకాయాన ప్రాంతంగా పోర్టు అభివృద్ధికి ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో అనేక రోడ్ల వసతి కల్పించినట్లు తెలిపారు. వివిధ రకాల పంటలు, ధాన్యాల ఎగుమతికి పోర్టు ద్వారా అవకాశం ఉంటుందని తెలిపారు. స్వతంత్రం వచ్చి వందేళ్ల పూర్తవుతున్న సందర్భంగా తయారు చేసే ఈ డాక్యుమెంట్ అభివృద్ధికి 2047 నాటికి అందరి సహకారం అవసరమని అన్నారు.

వికలాంగ రిజర్వేషన్ అమలు చేయాలి

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక మునిసిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి దివ్యాంగులకు మునిసిపల్ షాపుల్లో జీఒ ఎంఎస్ నెంబర్43 ప్రకారం 5శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా కోరారు. దివ్యాంగులకు మునిసిపలిటీ షాపింగ్ కాంప్లెక్స్‌లలో షాపుల కేటాయింపులో రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. అర్హులైన దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం - 2016 ప్రకారం రాయితీ కల్పించాలని కోరారు. నడవలేని, కనపడని, వినపడని అర్హులైన దివ్యాంగుల కోసం ఐదు శాతం రిజర్వేషన్ అమలు పరిచే విధంగా ఉత్తర్వులు ఉన్నప్పటికీ మునిసిపల్ అధికారులు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. దివ్యాంగులు ఏదైనా బ్యాంకు రుణం తీసుకుని ఉపాధి పొందాలంటే ఎక్కువ మొత్తంలో అద్దెలు ఉండటంతో అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు అందరికీ ఉద్యోగాలు రాక ఉపాధి పొందే క్రమంలో మునిసిపల్ అధికారులు దివ్యాంగుల రిజర్వేషన్ అమలు పరచకపోవడంతో ఎంతో మంది నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన జిఒలను అమలు చేయాలని అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చిన ఉన్నతాధికారుల నుండి జిఒలను అమలు పరచమని ఆదేశాలు వచ్చిన అమలు పరచకుండా దివ్యాంగులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా విచారణ జరిపి దివ్యాంగుల అభివృద్ధి, ఉపాధి కల్పనకు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బణవత్ వెంకటేశ్వరరావు, అమీర్, రాజేష్ పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు

వినతులు స్వీకరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అర్జీలు స్వీకరించిన గొట్టిపాటి

ప్రజాశక్తి - అద్దంకి

ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయానికి తరలివచ్చిన ప్రజలతో మమేకమై వారి సమస్యలపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ వినతిపత్రాలు స్వీకరించారు. సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటి సొంత నిధులతో త్రీవీల్ స్కూటీ

త్రీవీల్ స్కూటర్ బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని శింగరకొండపాలెంకు చెందిన దివ్యాంగురాలు దాచేపల్లి మల్లీశ్వరికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన సొంత నిధులతో రూ.1.40లక్షల విలువైన త్రీవీల్ స్కూటర్‌ను స్థానిక మున్సిపల్ కార్యాలయం దగ్గర సోమవారం అందజేశారు.

వినతి పత్రం అందజేస్తున్న భీమా ఏజెంట్లు

ప్రజలకు నష్టం చేసే విధానాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - అద్దంకి

భీమా రంగంలో పాలసీదారులు, ఏజెంట్లకు నష్టాన్ని చేకూరుస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలు వెంటనే విరమించుకోవాలని లియాఫీ 1964 నాయకులు డిమాండ్ చేశారు. కనీస భీమా రూ.లక్ష నుండి రూ.2లక్షలు చేయడం వల్ల చిన్న చిన్న కుటుంబాలు భీమా సౌకర్యాన్ని కోల్పోవడాన్ని నిరసిస్తూ స్థానిక సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మాధవ కృష్ణకు లియాఫీ నాయకులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లియాఫీ బ్రాంచ్ అధ్యక్షులు వల్లం నాగేశ్వరరావు మాట్లాడుతూ భీమా రంగంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వారు తీసుకున్న నిర్ణయాల వల్ల సన్న చిన్న కారు కుటుంబాలు భీమా సౌకర్యం కోల్పోవడంతో పాటు, ఏజెంట్లకు తీవ్ర నష్టం వాటిల్లు తుందని తెలిపారు. ఎల్ఐసి యాజమాన్యం వెంటనే స్పందించి నిర్ణయాలు ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లియాఫీ సెంట్రల్ సెక్రటరీ నెంబర్ చుండూరి నరసింహారావు, మురళీకృష్ణ, త్రిమూర్తులు, వీరాస్వామి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా మారుస్తారనే వదంతులు నమ్మొద్దు

విలేకర్ల సమావేశంలో శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్లలో రెండు దశాబ్దాల అనంతరం తెలుగుదేశం గెలిచిందని, టిడిపిపై బురద చల్లేందుకే బాపట్ల జిల్లా మారుస్తారనే ప్రచారం చేస్తున్నారా? రాష్ట్ర స్థాయిలోనే ఈ అంశంపై తప్పుడు ప్రచారం జరుగుతుందా అనే అంశం తెలియదని శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల జిల్లాను మారుస్తారనే అంశంపై పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు అనుకున్నవి అనుకున్నట్లు జరుగుతున్నాయని అన్నారు. వైద్య కళాశాలతో సహా అన్ని యధాతథంగా జరుగుతాయని అన్నారు. జిల్లా మారుతుందనే వదంతులు నమ్మవద్దని కోరారు.

గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సిగా ఆలపాటిని గెలిపించండి

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని ఎంఎల్‌ఎ నరేంద్ర వర్మ కోరారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నరేంద్ర వర్మ

నవంబర్ 6వరకు గ్రాడ్యుయేట్ ఓటును తెలుగుదేశం కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చని అన్నారు. 33 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎంఎల్‌సి అభ్యర్థిగా ఆలపాటిని ఎంపిక చేసుకొనే అవకాశం ఉందన్నారు. ఈనెల 11న పార్టీ కార్యాలయంలో జరగనున్న సర్వసభ్య సమావేశానికి ఎంఎల్‌సి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ పాల్గొన్నారు.

కిషోర్‌బాబుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

ముగిసిన వర్క్ షాప్

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మాట్ లాబ్, సిములింక్ అప్లికేషన్స్ ఆన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌పై రెండు రోజుల వర్క్ షాపు విజయవంతంగా జరిగినట్లు కళాశాల సెక్రటరి వనమా రామక ృషా?రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. మాట్ లాబ్, సిములింక్ అప్లికేషన్స్ ఇన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌పై రెండు రోజుల వర్క్ షాపును ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో మూడవ, నాల్గవ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కె జగదీశ్ బాబు తెలిపారు. ఇఇఇ హెచ్ఒడి, వైస్ ప్రిన్సిపాల్, జెఎన్టియుకె, యూనివర్సిటి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, నరసరావుపేట ఇన్‌ఛార్జి వైఎస్ కిషోర్‌బాబు పాల్గొన్నట్లు తెలిపారు. బిటెక్, ఇఇఇ విద్యార్థులు 100 మంది పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ వర్క్ షాపులో మాట్ లాబ్, సిములింక్ అప్లికేషన్స్‌ను ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్లో ఎలా ఉపయోగిస్తారో అవగాహన కల్పించారని తెలిపారు. మాట్ లాబ్, సిములింక్ అప్లికేషన్స్‌పై అవగాహన పెంపొందించుకుని వాటిపై పనిచేయడం నేర్చుకోవటం వలన డిజైనింగ్, మానుఫాక్చరింగ్ రంగాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. తద్వారా వారి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని మెరుగైన విద్యుత్ సరఫరా చేయవచ్చని తెలిపారు. బిటెక్ విద్యార్థులు ఈ వర్క్ షాపు హాజరవ్వటం ఎంతో ఉపయోగకరమైనదని అన్నారు. వారి ఉద్యోగ అవకాశాలు మెరుగు పడటానికి దోహద పడుతుందని ఇఇఇ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎస్‌విడి అనిల్ కుమార్ పేర్కొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

ఎంఎల్ఎ కొండయ్య చొరవతో రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రధాన రహదారిలో గోరంట్ల హాస్పిటల్ వద్ద రోడ్డు మధ్య భాగం మరమ్మత్తులకు గురైంది. పెద్ద గుంట ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కూడా రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంటల పరిష్కారానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాల్వల పైపులు మరమ్మత్తులు చేయించారు. అండర్ డ్రైనేజీలో నీళ్ల కారణంగా మట్టి కరిగి రోడ్డు కుంగుతున్నట్లు చెబుతున్నారు. అలాంటి మెతక ప్రాంతాలను గుర్తించి మరోసారి రోడ్డు మరమ్మత్తులు చేయించాలని కోరారు. రహదారి విషయంపై వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా తాత్కాలికంగా రోడ్డు మరమ్మత్తులను చేయించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో శాశ్వత పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ రహదారిని త్వరలో శాశ్వత పరిష్కారం చర్యలు తీసుకుంటామని అప్పటి వరకు వాహనదారుల ప్రయాణానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్డుపై గుంటను పూడ్చి సమస్యను పరిష్కారించారు. రహదారి సమస్యపై ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య వెంటనే స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేయించడంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరిలో జింక్ పోషక లోపం నివారణ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం, కోటికలపూడి, పార్వతీపురం, కలవకూరు, కొత్తరెడ్డిపాలెం, సింగరకొండపాలెం గ్రామాల్లో ప్రస్తుతం వరి నారు ముళ ్ళ ఉన్నాయి. వరి దిగుబడుల్లో స్థూల పోషకాలతో పాటు సూక్ష్మపోషకాలు కీలకపాత్ర పోషిస్తాయి. ఇవి ఆశించిన మేర పంటకు అందకుంటే దిగుబడులు తగ్గుతాయని ఎఒ కుర్రపాట వెంకటక ృష? తెలిపారు. సూక్ష్మ పోషకాల్లో జింకు పోషకం పంటకు చాలా ముఖ్యమైనది. ప్రస్తుతం చాలా చోట్ల వరి నారుమళ్లలో జింకు లోపం కనిపిస్తోంది. జింకు లోపానికి కారణాలు, దాన్ని ఏ లక్షణాలతో గుర్తించాలి?, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంట మార్పిడి పాటించకుండా వరి తర్వాత అదే భూమిలో పదే పదే వరి పండించడం వల్ల కూడా జింకు లోపం పెరగవచ్చని తెలిపారు. పొలంలో ఎక్కువ రోజులు నీళ్లు నిల్వ ఉంచడం వల్ల మొక్కల వేర్లకు జింక్ సరిగా అందదని తెలిపారు. రసాయన ఎరువులు నత్రజని, భాస్వరం, పొటాష్‌లను అధికంగా వాడడం, జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులు వాడకపోవడం వల్ల వరిలో జింక్ పోషక లోపం కనిపిస్తుందని తెలిపారు.

జింక్ పోషక లోపాన్ని గుర్తించడం ఎలా?

వరి నారు మడిలో, నాట్లు వేసుకున్న 20 నుంచి 40 రోజుల్లో జింక్ లోపం కనిపిస్తుంది. మొక్కలు గిడసబారి చివరి ఆకులు కుచ్చుగా మారతాయి. ఆకులు సాధారణ పరిమాణం కంటే పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. ముదురు ఆకుల చివరి భాగంలో ఈనెల ఇరువైపులా ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. అవి ఆకు అంతా వ్యాపించి ఆకులు లేత ఎరుపు లేదా ఇత్తడి రంగులోకి మారతాయి.

జింక్ లోపం వలన మొక్కల్లో జరిగే జీవ, రసాయన చర్యలకు అంతరాయం ఏర్పడి మొక్క ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా మొక్కల సంఖ్య క్రమంగా తగ్గుతుంది. దీన్ని సవరించకపోతే పిలకలు తగ్గి పంటకాలం పెరిగే ఆస్కారం ఉంటుంది. నత్రజని ఎరువులు వేసినా పైరు పచ్చబడదు.

జింక్ పోషక లోపానికి ప్రధాన కారణాలు

నేలల్లో లవణాల సాంద్రత అధికంగా ఉండటం, ఇసుక నేలల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉంటే జింక్ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. నేల ఒత్తిడి వల్ల కూడా వేర్లకు జింక్ పోషకం అందదు. నేలల్లో సేంద్రియకర్బనం తక్కువగా ఉన్నా ఈ పోషక లోపం ఏర్పడుతుంది. మురుగు నీటి పారుదల సౌకర్యం లేని పల్లపు భూముల్లో వరి తర్వాత వరి పండించే భూముల్లో, సున్నపు నేలల్లో ఈ పోషక లోపం కనిపిస్తుంది. భాస్వరం ఎరువులు ఎక్కువగా వాడడం, భూమిలో మెగ్నీషియం అధికంగా ఉన్నప్పుడు,

రైతులతో మాట్లాడుతున్న ఎఒ వెంకటకృష్ణ

ఉదజని సూచిక (పిహెచ్) 7 దాటినప్పుడు ఈ పోషక లోపం ఏర్పడుతుంది.

జింక్ వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

భాస్వరంతో పాటు జింకును కలిపి చల్లకూడదు. రెండూ కలిపి చల్లితే వాటి మధ్య రసాయనిక చర్య జరిగి జింక్ పోషకం మొక్కకు అందకుండా పోతుంది. కాబట్టి జింక్, భాస్వరం ఎరువుల మధ్య కనీసం మూడు రోజుల వ్యవధి పాటించాలి. సమస్యాత్మక నేలలైతే ఎకరాకు 40కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. సుమారు 200కిలోల సేంద్రియ ఎరువును 15కిలోల జింక్ సల్ఫేట్తో కలిపి ఒక నెల మాగనిచ్చి నాటే ముందు వేస్తే జింక్ సామర్థ్యం పెరుగుతుంది. జింక్ సల్ఫేట్ ద్రావణంలో ఎలాంటి తెగుళ్ల, పురుగుల మందులను కలిపి పిచికారి చేయకూడదు. నేలలో జింక్ లోపం గుర్తిస్తే నివారణకు మరిన్ని సలహాలు, సూచనల కోసం స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

జింక్ నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జింక్ లోపాన్ని రెండు పద్ధతుల ద్వారా నివారించుకోవచ్చు. భూసార పరీక్షల ద్వారా నేలల్లో జింక్ లోపం ఉన్నట్లు గుర్తిస్తే నాట్లు వేయడానికి ముందు ఆఖరి దుక్కిలో ఎకరానికి 20కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలి. వరి తప్ప వేరే పంటలు పండించని పొలాల్లో ప్రతి మూడు పంటలకు ఒకసారి (లేదా) ప్రతి యాసంగిలో ఎకరాకు 20కిలోల జింక్ సల్ఫేట్ ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. దీని వల్ల పంట దిగుబడిలో ఆశించిన వ ృద్ధి సాధించవచ్చు. ఒకవేళ మొక్కలు పెరుగుతున్నప్పుడు జింక్ లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలుపుకొని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. దీని వల్ల ఆకులు త్వరగా పోషకాన్ని గ్రహిస్తాయి. గాఢత ఎక్కువైతే ఆకులు మాడిపోయే అవకాశం ఉంటుంది. జింకను పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుంది. తద్వారా రైతులకు పంటలు దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.రు.

అన్నపూర్ణేశ్వరి అలంకరణలో వాసవీ అమ్మవారు

ప్రజాశక్తి - అద్దంకి

దసర పండుగ సందరరేగా 53వ దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు ఆలయ పూజారులు శ్రీ వాసవి అమ్మవారిని శ్రీ అన్న పూర్ణేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ చైర్మన్ ఊటుకూరి రామ కోటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లోని శ్రీ ధన్వంతరీ దత్త పాదుకా క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా శ్రీఅన్న పూర్ణదేవి అలంకరణలో దర్శనం కల్పించారు. నాగసూరి హనుమత్ ప్రసాద్ దర్శించుకున్నారు.

చెక్కు అందజేస్తున్న పత్తి వెంకట సుబ్బారావు

'సుకన్య సమృద్ధి యోజన'కు ప్రోత్సాహం

ప్రజాశక్తి - వేటపాలెం

తపాల కార్యాలయంలో బాలికల అభివ ృద్ధికి, యుక్త వయస్సులో వారి చదువులు, వివాహాల నిమిత్తం బాలిక సమృద్ధి యోజన పథకం ప్రవేశపెట్టి 7.5శాతం వడ్డీ రేటు, 15ఏళ్ల పథకంగా ప్రవేశపెట్టి అమలులో ఉన్నట్లు సబ్ పోస్ట్ మాస్టర్ రేష్మ తెలిపారు. బాలికల ఉన్నత విద్య, అభివ ృద్ధికి, మహిళల్లో పొదుపు తత్వం పెడుగుదలకు ప్రోత్సాహకంగా పట్టభద్రుల సంఘం, తపాలా శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నూతన అకౌంట్ ప్రారంభ రూ.250 చొప్పున పట్టభద్రుల సంఘం ప్రోత్సాహకంగా రూ.25వేల చెక్కును వంద మందికి సబ్ పోస్ట్ మాస్టర్ కుమారి రేష్మాకు సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు సోమవారం అందచేశారు. ఈ సందరరేగా రేష్మా మాట్లాడుతూ పట్టభద్రుల సంఘం, యీ ప్రాంత బాలికలు పెద్దైన తరువాత ఈ సేవ తల్లితండ్రులకు గుర్తుగా వుండిపోతున్నదని అన్నారు. సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ బాలికల అభివ ృద్ధి, చదువు, జీవిత సాకారం ముడి పడి వున్న పథకం అన్నారు. అందువలన మహిళల్లో తమ ఆడ బిడ్డకు పొదుపుకు సహకారం, మార్గదర్శకం చేయుటకు తమ చిన్న సహకారమని అన్నారు. కార్యక్రమంలో రావి మస్తాన్‌రెడ్డి, చుండూరు మురళీ కృష్ణ, హరి ప్రసాద్, పూల శ్రీను, పోస్ట్ మాన్ సజ్జా రవి కుమార్, డాక్ సేవక్ కుమారి, కట్టా తేజ పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గ సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 8, 9 తేదీల్లో రెండు రోజులపాటు పంచాయతీల ఉప సర్పంచ్‌లు, ఇక మహిళా వార్డు సభ్యులు, ఒక పురుష వార్డు సభ్యునికి శిక్షణ జరుగుతుందని ఎంపిడిఒ కె స్వరూప రాణి సోమవారం తెలిపారు. కామన్ మినిమం అడ్మినిస్ట్రేషన్, గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులను సమకూర్చుకోవడం, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సరఫరా, పంచాయతీలోని భవనాల రెగలైజేషన్, వీధి దీపాల బిల్లులు, లీగల్ ఇంట్రసి మొదలైన అంశాల గురించి జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన టిఓటిల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణకు ఎంపిక చేసిన పంచాయితీ సభ్యులు హాజరు కావాలని కోరారు. పంచాయతీ సెక్రటరీలు బాధ్యత తీసుకొని వీరిని శిక్షణకు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి -మార్టూరు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం దృష్ట్యా రైతులకు స్థానిక రైతు వికాస కేంద్రం నందు డిఎపి, యూరియా అందుబాటులో ఉన్నాయని విఎఎ అమల తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు రసాయన ఎరువులు అవసరమైన రైతులకు సబ్సిడీపై అందించే డిఎపి, యూరియా రైతులకు అవసరమైనంత సిద్ధం చేసినట్లు తెలిపారు. డిఎపి రూ.1350, యూరియా రూ.267లు ధర చెల్లియించాలని ప్రభుత్వం మంజూరే చేస్తున్నట్ల చెప్పారు. రైతులు సాగు చేసిన పంటలను ఈపాస్ నమోదు చేసుకోవాలని సూచించారు. అవసరం మేరకు మాత్రమే ఎరువులు వినియోగించడం వల్ల భూమి ఆరోగ్యం బాగుంటుందని సూచించారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ ఇచ్చి తీసుకోవాలని తెలిపారు.

రిజిస్ట్రేషన్ సమస్యలపై సిఎంతో మాట్లాడతా..

స్పందన కార్యక్రమంలో మంత్రి స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ, పాత శింగరాయకొండ, సోమరాజు పల్లి గ్రామాల్లో ఉన్న రిజిస్ట్రేషన్ సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కషి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, సచివాలయ, వాలంటీర్ల వయోవద్ధుల శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. సోమవారం నాడు శింగరాయకొండ మండల పరిషత్ అభివద్ధి కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మంత్రి స్వామి పాల్గొని వివిధ సమస్యలపై అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. వచ్చిన అర్జీలపై పూర్తి స్థాయిలో పరిశీలన చేసి సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మీడియాతో మాట్లాడుతూ మొత్తం 91 అర్జీలు రావడం జరిగిందని, అందులో ఎక్కువ సంఖ్యలో రెవెన్యూ సంబంధిత అంశాలపై, పెన్షన్స్ మంజూరుపై వచ్చాయన్నారు. ఇళ్లస్థలాల మంజూరుకు, ఇళ్లస్థలాలు, భూములు ఆక్రమించారని, రీసర్వే, అసైన్డ్ భూములను ఆక్రమించుకొని అక్రమ లేఅవుట్స్ వేశారని, తదితర అంశాలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి కషి చేస్తామన్నారు. హౌసింగ్ స్కీమ్ కింద కట్టుకున్న ఇళ్లకు సంబంధించి బిల్లులు రాలేదని, కొత్త ఇల్లు మంజూరు గురించి అర్జీలు వచ్చినట్లు మంత్రి

సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి స్వామి

తెలిపారు. కొత్తగా ఇల్లు మంజూరుకు రూ.4 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యుత్ లైన్ల విస్తరణపై కూడా అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. కనమల్ల రోడ్డు క్రాసింగ్ ప్రమాదాలకు నిలయంగా మారిందని, సిగ్నల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని అర్జీలు వచ్చినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల కాలంలో ఒక్క కొండపి నియోజక వర్గంలో రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణానికి రూ.17 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ నెల 14 నుంచి వారం రోజుల పాటు పల్లె పండుగ కార్యక్రమం కింద మంజూరైన పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మిప్రసన్న, తహశీల్దార్ రవి, ఎంపిడిఓ శ జయమణి, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

రన్‌వేపై ప్రమాదాలు జరగకుండా చూడాలి

జాతీయ రహదారి పరిధిలోని కనుమళ్ల రన్వే వద్ద ప్రమాదాలు జరక్కుండా చూడాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సూచించారు. సోమవారం నాడు ప్రమాదాలు జరుగు కనుమల్ల రోడ్డును పరిశీలించారు. ఇక్కడ ప్రతిరోజూ ఏదో ఒక విధంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలపై సమగ్రంగా చర్చించి ఒక నిర్ణయానికి రావాలన్నారు. జాతీయ రహదారి అధికారులు సరిగా స్పందించకపోతే తాను రోడ్డు మీద కూర్చోవడం ఎంతో సేపు పట్టదని, ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని ఆయన అధికారులకు హెచ్చరించారు.

శింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని పాకల రోడ్డు నుంచి సాయిబాబా దేవస్థానం వరకు రోడ్డుకి రెండు వైపులా ఉన్న గుంటను పూడ్చేందుకు తక్షణమే పనులు జరిగేలా చూడాలని ఆర్అండ్‌బి అధికారులకు ఆదేశించారు. సోమవారం నాడు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ట్రంకు రోడ్డుని పరిశీలించారు. పోలీస్ స్టేషన్ వద్ద ఆయన రోడ్లను పరిశీలించి.. పోలీస్‌స్టేషన్‌కి ఇరువైపులా ఉన్న స్థలం వద్ద బాగు చేయించుకొని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ బోర్డు ప్రైవేటు సంస్థల పేరుతో ఉండటంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సింబల్‌తో పోలీసు బోర్డు ఉండాలని సూచించారు. రైల్వే రోడ్‌లో డివైడర్‌ను తక్షణం ఏర్పాటుచేయాలని ఏఈ కోటా శ్రీహరికి సూచించారు. వీరి వెంట సిఐ సిహెచ్.హాజరత్తయ్య, ఎస్సై బి.మహేంద్ర, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, ఇమ్మడిశెట్టి రామారావు, సుదర్శి ప్రసాదరావు, చిగురుపాటి శేషగిరి, ఉప సర్పంచ్ నక్కా బ్రహ్మేశ్వరరావు, ఆర్అండ్‌బి ఏఈ మాధవరావు ఉన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

వరదల్లో నష్టపోయిన

డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వరదల్లో నష్టపోయిన డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుసంఘం, కౌలురైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం, ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం కష్ణానది వరదల వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలని కోరుతూ భట్టిప్రోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద సామూహిక రాయబారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సిఐటియు భట్టిప్రోలు మండల కార్యదర్శి జి.సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రమాదేవి మాట్లాడుతూ వరదల వల్ల రాబోయే మూడు నెలల పాటు పనులు లేనందున రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఆదుకోవడం కోసం రుణమాఫీ చేయాలన్నారు. మహిళలు దాచుకున్న పొదుపు డబ్బులను వెంటనే గ్రూపులకు ఇప్పించాలని, బ్యాంక్ అధికారులు గానీ, డ్వాక్రా అధికారులు గానీ లోన్లు కట్టాలని ఒత్తిడి చేస్తే ప్రభుత్వ కార్యాలయాలు దిగ్బంధిస్తామని హెచ్చరించారు. రాయబార కార్యక్రమం వద్దకు మండల తహశీల్దార్, ఎంపిడిఓ, ఏపీఎం వచ్చి వరదల వల్ల నష్టపోయిన వారికి నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. రానివారికి వారి పేర్లు నమోదు చేస్తామని, డ్వాక్రా రుణమాఫీ సమస్యపై ఉన్నతాధికారులకు తెలియజేసి, ప్రస్తుతం బ్యాంక్ అధికారులు నుంచి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. పొదుపు డబ్బులు గ్రూపులకు ఇప్పిస్తామని, ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట రామయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు గోళ్ళ నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్ కుమార్, దీపాల సత్యనారాయణ, నాగమల్లేశ్వరరావు, పెసర్లంక, పెద్దలంక, చింతమోటు,గ్రామ పంచాయతీ, ఒలేరు పల్లెపాలెం నుండి వందలాది మంది డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాస్తారోకో చేస్తున్న మహిళలు

మండలంలోని మురారి పల్లి పంచాయతీ పరిధిలో గల వేగినాటి కోటయ్య నగర్‌లో నివసిస్తున్న ప్రజలు గత 15 రోజులు నుంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. దీంతో ఆ కాలనీ మహిళలు, ప్రజలు ఖాళీ బిందెలతో సోమవారం మాచర్ల-మార్కాపురం 565 జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. నీటి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. నీటి సమస్య తీర్చాల్సిందేనని పట్టుపట్టడంతో ఈవోఆర్డీ ఈదుల రాజశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులతో మాట్లాడారు. ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ప్రజలు, మహిళలు ధర్నాను విరమించారు. ఎస్సై పి చౌడయ్య పాల్గొని ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వాహనాలను పంపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రామారావు నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వీరాయిపాలెం, పందివానిపల్లి గ్రామాల్లో సాగు చేసిన పత్తి, మిరప పంటలను ఉద్యానశాఖాధికారి పి ఆదిరెడ్డి, వ్యవసాయ విస్తర్ణాధికారి ఎల్ మాల్యాద్రిరెడ్డి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పత్తి, మిరప పంటల్లో నీరు నిలిచిందని చెప్పారు. రైతులు వెంటనే పొలాల్లో నిలిచిన నీటిని కాలువల ద్వారా బయటకు పంపించి వేయాలని చెప్పారు. పొలంలోని తేమ ఆరిన తర్వాత 19:19:19 మరియు ఆగ్రోమిన్ మ్యాక్స్ కలిపిఇ పిచికారి చేయాలని సూచించారు. అలాగే పడిపోయిన మొక్కలను నిలబెట్టి మొదళ్ల దగ్గర మట్టి వేసి గట్టిగా కాళ్లతో తొక్కి మొక్క నిలబడేలా చేయాలని రైతులకు వివరించారు. పత్తి పొలాల్లో నీరు బయటకు తీసి వేసి ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలిపి పైపాటుగా చల్లుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఏఏ డి సురేంద్ర నాయక్, రైతులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దీపావళి పండుగ సంధర్భంగా బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశిల్దార్ బాలకిశోర్ సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తాత్కాలిక లైసెన్సులు కోసం ఈనెల 15వ తేదిలోపు మీసేవ కేంద్రాలు, సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు చేసుకోకుండా బాణాసంచా షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలు తీరేదెప్పుడో.?

- కనీస పెన్షన్ అమలు జరిగేనా.!
- నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల సమస్యలు తీరటం లేదు. కనీస పెన్షన్ అమలు జరగటం లేదు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత రెండేళ్లుగా పెన్షనర్లు పోరాటం చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టింది. పెన్షనర్ల సమస్యలపై ప్రత్యేక కథనం..

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల ధర్నా (ఫైల్)

పెన్షనర్ల హక్కులను ప్రభుత్వం కాల రాస్తోంది. రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన ఈ ప్రక్రియపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమకు తోచిన విధంగా అమలు చేస్తున్నాయి. ఈ ప్రక్రియతో 20 నుంచి 40 ఏళ్ళ పైబడి ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లు, వారి వారసులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. 2004 తరువాత ప్రభుత్వ సర్వీసులో చేరిన ఉద్యోగులకు రిటైర్మెంట్ అనంతరం అందే పాత పద్ధతి పెన్షన్ స్థానంలో సిపిఎస్ అమలుకు తెరలేపిన అంశం తెలిసిందే. ఈ పద్ధతిలో అమలులోనూ తీవ్రమైన గందరగోళం నెలకొన్న నేపథ్యంలో ఉద్యోగ సంఘాలు, పెన్షనర్లు ఓపిఎస్ కోసం ఉద్యమం సాగిస్తున్నారు. ఈపాటికే ఉద్యోగ విరమణ పొందిన కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు పెన్షన్ అమలు ప్రక్రియపై ఉద్యమం సాగిస్తున్నారు. నిరంతరం అదుపు లేని నిత్యావసరాల ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంపుదల విషయంలో ఉద్యోగ వర్గాలు తీవ్రమైన ఆందోళన వెలిబుచ్చుతున్నారు. గత ఆరేళ్ళ నుంచి డిఏ పెంపుదల లేకపోవటంతో పెన్షనర్లు కుటుంబ ఖర్చుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యామిలీ పెన్షనర్ల ఇక్కట్లు మరింత వర్ణనాతీతం. కుటుంబ అవసరాలతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తటంతో ఆయ కుటుంబాలు అప్పులు పాలవుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ ఆరేళ్ళ కాంలో రాష్ట్రం ప్రభుత్వం డిఏ ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పెంచినట్లయితే దామాషా ప్రకారం పెన్షన్ పెరిగి ఆర్థికంగా వెసులుబాటు కలిగి ఉండేది. దీనికి తోడు 12వ వేతన సంఘం డిమాండ్‌కు అనుగుణంగా ఐఆర్ ప్రకటించినా ఆ మేరకు పెన్షన్ స్లాబ్ పెరిగి ఆర్థికంగా వెసులుబాటు ఉండేది. 2018 నుంచి 2024 వరకు 10 పెండింగ్ డిఏలకు సంబింధించి దామాసా ప్రకారం అమలు జరిపినా పెన్షప్ పెరుగుదలకు తోడ్పడేది.

ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికల హామీలు తప్ప అమలుకు ప్రయత్నించిన దాఖలాలు లేవు. రాష్ట్రవ్యాప్తంగా పెన్షనర్లు గత రెండేళ్లుగా పెన్షన్ తమ హక్కుగా ఉద్యమం సాగిస్తున్నారు. తమ సుదీర్ఘ పోరాటానికి హామీలు తప్ప అమలు శూన్యం.. జిల్లాలో 36 వేల మంది సర్వీస్ పెన్షనర్లు, మరో 6 వేల మంది ఫ్యామిలీ పెన్షనర్లు, ఉన్నారు. ముఖంగా సింగిల్ పెన్షనర్స్, సింగిల్ ఫ్యామిలీ పెన్షనర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల పెన్షన్ ప్రశ్నార్థకం

వివిధ ప్రభుత్వ శాఖలలో 25 నుంచి 30 ఏళ్ళ సర్వీస్ చేసిన అంగన్‌వాడీలు, ఐకెపి సిబ్బంది, సర్వశిక్షా అభియాన్, పనిచేస్తున్న ఉద్యోగులు, మున్సిపల్, పంచాయతీరాజ్ కార్మికులు, ఇతర శాఖలలోని ఉద్యోగులు, వివిధ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ ఉంది. ఈపాటికే ఉద్యోగ విరమణ పొందే అంగన్‌వాడీలకు ఎటువంటి పెన్షన్ అమలుకు నోచుకోని పరిస్థితి. ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ రూ.4 వేలు పథకం సైతం వీరికి అమలు కాని పరిస్థితి ఉంది. ఆధార్ డేటా ప్రకారం అంగన్‌వాడీ రిటైర్ ఉద్యోగిగా నమోదైన కారణంగా పెన్షన్ పోర్టల్‌లో వీరిని అనుమతించటం లేదు. సుదీర్ఘకాలం పనిచేసి రిటైర్ అయిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీసం రూ.9 వేలు పెన్షన్ ఇవ్వాలని ఆయా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రైవేట్ రంగంలో సుదీర్ఘ కాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారికి 5-6 వేలు పెన్షన్ అందని పరిస్థితి వీరందకి 9 వేలు పెన్షన్ ఇవ్వాలనే డిమాండ్ ఉంది.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 9 మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యరకమంలో పెన్షనర్లు పాల్గొని జయప్రదం చయాలని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శేషయ్య, సిహెచ్ రాంబాబు కోరారు.